క్లుప్తంగా

రుణమాఫీ చేయాలి

ములకలపల్లి: రైతులకు ఒకేదఫాలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని, 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను ఇవ్వాలని అన్నారు. సంఘ జిల్లా నాయకులు నకిరకంటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొర్సా గణపతి, మడివి దేవయ్య పాల్గొన్నారు.

విశ్రాంతి గది నిర్మించాలని వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కూనవరం రైల్వేగేట్ సమీపంలో సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు విశ్రాంతి గది(రెస్ట్ షెల్టర్)ను నిర్మించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో డీవైఎస్ఈ(సివిల్) పాత్రుడు కి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. బొగ్గు రవాణాకు ఎటువంటి ఆటంకం రాకుండా ఎన్నో ఏళ్లుగా రైల్వే ట్రాక్ వెంబడి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు ఎండనకా, వాననకా శ్రమిస్తున్నారన్నారు. కార్మికుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని రెస్ట్ షెల్టర్‌ను నిర్మించాలని ఆయన యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు వి శంకర్, టి రామకృష్ణ, హౌసింగ్, ఉప్పల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై చర్యలు తీసుకోవాలి

భద్రాచలంటౌన్: బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న దళిత ఏఎస్ఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతను కాపాడే పోలీసులకే భద్రత లేకపోతే సామాన్య ప్రజలకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. విధినిర్వహణలో ఉన్న దళిత ఏఎస్ఐను దూషించడంతో పాటు దాడి చేసిన అధికార పార్టీ యువజన నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీ పరామర్శ

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన పల్లంటి ప్రభావతి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమెను గురువారం మాజీ పార్లమెంట్ సభ్యులు జీవీ హర్షకుమార్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్యం పూర్తిస్థాయిలో కుదుటపడే వరకు జాగ్రత్తగా ఉండాలని ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లంటి రమేష్, బోడ దివ్య, కూరపాటి దాసు, బొజ్జ వెంకటేశ్వర్లు, శెనగ పెద్దపుల్లయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుడు..

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగరాజు కుమారుడు కొమరం రాము పాల్వంచ మండలం కారెగట్టులో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి పాల్వంచలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గొందిగూడెంలో గురువారం రాము మృతదేహానికి డీసీసీబీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొంది గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్‌లు పాయం భద్రమ్మ, పొడియం అనిల్, కాంగ్రెస్ నాయకులు తాటి భద్రయ్య, పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని జంగారెడ్డిగూడెం మార్గంలోని షిర్డీసాయిబాబా ఆలయ 20వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామున మేలుకొలుపు, కాకడ హారతులు పట్టారు. అలాగే పంచామృతాభిషేకాలు, శతకటాభిషేకం, ప్రత్యేక హారతులు పట్టి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నసమారాధాన నిర్వహించారు. రాత్రి 7గంటలకు పుర వీధుల్లో బాబా వారికి పల్లకి సేవలు చేశారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాధునికి ప్రత్యేక పూజలు, అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు పట్టణ ప్రముఖులు వందనపు నాగేశ్వరరావు-సుభల దంపతులు, శ్రీనివాసరావు-లక్ష్మి నీలిమ దంపతులు, భవ్య సాధిక, అజయ్ భార్గవ్‌లు సాయినాధుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాతలను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా భవనాలు

- నాడు రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ సిబ్బంది కోసం నిర్మాణం
- సీతారామ ప్రాజెక్టుగా మారడంతో పంప్‌హౌజ్ మరో ప్రాంతానికి తరలింపు
- ఖాళీగా ఉండిపోయిన నాటి భవనాలు
- పూర్తి చేసి నిరుపేదలకు ఇవ్వాలంటున్న స్థానికులు



గొల్లగూడెంలో నిరుపయోగంగా ఉన్న భవనాలు

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గతంలో ఎన్నో ఏళ్ల క్రితం రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ నిర్వహణ సిబ్బంది క్వార్టర్ల కోసం నిర్మించిన భవనాలు నిరూపయోగంగా మారాయి. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హాయాంలో జలయజ్ఞంలో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్ట్‌లో భాగంగా గొల్లగూడెంలో పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. పంప్‌హౌస్ నిర్వహణ సిబ్బంది నివాసాల కోసం గొల్లగూడెంలో 18 భవనాలు నిర్మాణాలు చేపట్టారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీ అధికారంలోనికి వచ్చాక ప్రాజెక్ట్‌ల రీడిజైన్‌లలో రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్‌ను సీతారామ ప్రాజెక్ట్‌గా మార్చి డిజైన్ మార్చారు. సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను బీజీకొత్తూరులో నిర్మించారు. పంప్‌హౌస్ సిబ్బంది నివాసాలకు క్వార్టర్లను పంప్‌హౌస్ సమీపంలోనే నిర్మించారు. గొల్లగూడెంలో గతంలో నిర్మించిన భవనాలు అసంపూర్తిగా నిరూపయోగంగా మారాయి.

నిరుపేదలకు ఇవ్వాలి..

గొల్లగూడెంలో రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ కోసం నిర్మించిన భవనాలు పూర్తి చేసి స్థానికంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్నో ఏండ్లుగా భవనాలు నిరూపయోగంగా ఉంటున్నాయని అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేసి నిరుపేదలకు కేటాయించి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామస్తులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని ప్రభుత్వంతో మాట్లాడి నిరూపయోగంగా ఉన్న భవనాలు ఇళ్లు లేని నిరుపేదలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపేదలకు కేటాయించాలి



గొల్లగూడెంలో రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ కోసం నిర్మించిన భవనాలు ఎన్నో ఏళ్లుగా నిరూపయోగంగా ఉన్నాయి. భవనాలు స్థానికంగా ఇళ్లులేని నిరుపేదలకు కేటాయించాలి. ప్రభుత్వం స్పందించి భవనాలు ఇండ్లు లేని నిరుపేదలకు ఇవ్వాలి.

– పొడియం అనీల్‌కుమార్, మాజీ సర్పంచ్, గొల్లగూడెం

ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం..



గొల్లగూడెం ఎస్సీ కాలనీలో సుమారు 20 కుటుంబాల వారం వర్షాకాలంలో వరదలు ముంచెత్తి ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ప్రతి ఏడాదీ వర్షాకాలంలో అవస్థలు పడుతున్నాం. రాజీవ్‌సాగర్ ప్రాజెక్ట్ భవనాలు ఎస్సీ కాలనీకి చెందిన కుటుంబాలకు కేటాయించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నాం.

– ఇల్లుటూరి మహేష్, ఎస్సీ కాలనీ, గొల్లగూడెం

‘ఉపాధి హామీ’లో వసూళ్లు!



అశ్వారావుపేటరూరల్: వలసలు నివారించేందుకు, పేదలకు ఉపాధి కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామి పథకం కొంతమంది కిందిస్థాయి ఉద్యోగులకు కాసులు కురిపిస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

అశ్వారావుపేట మండలంలోని 30 గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద జోరుగా పనులు సాగుతుండగా, రోజుకు దాదాపు మూడు వేల మంది కూలీలు హాజరు అవుతున్నారు. పెద్ద సంఖ్యలో కూలీలు వస్తుండగా ఇదే అదునుగా కొంతమంది ఉద్యోగులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. మండలంలోని వినాయకపురం గ్రామ పంచాయతీ పరిధిలోని వినాయకపురం, వినాయకపురం కాలనీతోపాటు దబ్బతోగు గ్రామానికి చెందిన సుమారు 150 మంది కూలీలు పనులు చేస్తుండగా, కొంతమంది కూలీలకు అధిక వేతనాల ఆశ చూపించి ఓ ఉద్యోగి వారి వద్ద నుంచి నగదు వసూళ్లకు పాల్పడినట్లు కొంత మంది కూలీలు ఆరోపిస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో కూలీ పనులకు హాజరైన కొంతమంది కూలీల వద్ద నుంచి కొలతలను పెంచి, దినసరి వేతనం రూ.300 వరకు వచ్చేలా చేస్తానని, దీనికి ఒకొక్క కూలీ రూ.200 చొప్పున ఇవ్వాల్సిందిగా చెప్పడంతో, అధిక వేతనాలకు ఆశ పడిన కొంత మంది కూలీలు ఒక్కరూ రూ.200 చొప్పున మొత్తం రూ.25వేల రూపాయాలను సేకరించి గడిచిన శుక్రవారం సదరు ఉద్యోగికు ముట్టజెప్పినట్లు తోటి కూలీలు ఆరోపిస్తున్నారు. ఈ వసూళ్ల బాధ్యతను ఓ మేట్‌కు అప్పగించగా, కూలీల వద్ద నుంచి నగదు సేకరించినట్లు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా చేసిన పనుల కొలతల్లో తేడాలు, పనులు చేయకుండానే చేసినట్లు అక్రమాలకు తెరలేపడంతో నిజాయితీగా ఎండలో శ్రమించి పని చేసిన కూలీలకు అన్యాయం జరుగుతున్నట్లు మిగిలిన కూలీలు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం: ఏపీఓ

ఈ వసూళ్ల వ్యవహారం తన దృష్టికి రాలేదని, దీనిపై క్షేత్రస్థాయిలో విచారణకు వెళ్లి సమగ్ర వివరాలు తెలుసుకుంటానని ఈజీఎస్ అశ్వారావుపేట ఏపీఓ నరేష్ అన్నారు. నగదు వసూళ్లకు పాల్పడినట్లు తేలితే ఉన్నతాధికారులకు నివేదిక అందించి, తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఆగ్రో ఫారెస్ట్రీతో పర్యావరణ పరిరక్షణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

బూర్గంపాడు: రైతులు ఆగ్రో ఫారెస్ట్రీ విధానంలో పంటలు సాగు చేసే పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ఉద్యానవనశాఖ అధికారి వైష్ణవి అన్నారు. మోరంపల్లిబంజర రైతువేదికలో గురువారం జీకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ, క్లెమ్ ట్రిక్ సంస్థలు సంయుక్తంగా సుస్థిర ఆగ్రో ఫారెస్ట్రీ ప్రాజెక్ట్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సన్న, చిన్నకారు రైతుల ఆదాయాన్ని పెంచి వారి జీవనోపాధులను మెరుగుపరిచేందుకు ఆగ్రో ఫారెస్ట్రీ విధానం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విధానంలో అనేక రకాల మొక్కలు సాగుచేసి రైతులు లాభాలను పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా కార్బన్ ఉద్గారాలను తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు బత్తుల కొండారెడ్డి, కైపు సుబ్బరామిరెడ్డి, సోమ్లానాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరులో ఏరియాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కోల్ శాంప్లింగ్, హిందుస్థాన్ కంపెనీ కార్మికులకు రెండు నెలలుగా కనీస వేతనాలు చెల్లించకుండా ఆయా యాజమాన్యాలు శ్రమదోపిడీ చేస్తున్నాయన్నారు. సమస్యలను ఎన్నిసార్లు యాజమాన్యాలకు విన్నవించినా, సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించి న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను, లేబర్ కమిషనర్‌ను సైతం కలవనున్నట్లు తెలిపారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఆదేర్ల సురేందర్, అవినాష్, సందీప్, సీతారాములు పాల్గొన్నారు.

నిందలు మోపడం సరికాదు

దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీనే నమ్ముకొని అన్ని ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తి యుక్తులా పని చేసిన తనపై కొందరు కావాలనే నిందలు మోపుతున్నారని, ఇది ఏ మాత్రం సరికాదని దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంకా అబ్బులు పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నేను కాంగ్రెస్ పార్టీకి మాత్రమే అభిమానినని, నాయకులకు అభిమానిని కాదని రాష్ట్రంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి దానిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం పాటు పడ్డానని అన్నారు. గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికలలో భద్రాచలం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలో నిలిచిన పొదెం వీరయ్య గెలుపు కోసం పట్టుదలతో పని చేశానని తెలిపారు. శాసన సభ ఎన్నికల సందర్భంలో కొన్ని శక్తులు వీరయ్య గెలుపునకు అడ్డుపడడం వల్ల మండలంలో స్వల్పంగా మెజారిటీ తగ్గిందని, ఈ కారణాన్ని బూచీగా చూపి తనపై నిందలు మోపుతున్నారని ఆయన అన్నారు. తనపై నిందలు వేస్తున్న వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

దమ్మపేట: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులు, చట్టాల అమలు కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక కార్మిక సంఘం సీఐటీయూ అని పేర్కొన్నారు. శ్రామిక వర్గంలో ఐక్యతను పెంచి, సమస్యలపై ఉద్యమాలు చేయడంలో సీఐటీయూ అగ్రభాగాన నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, కోడూరి కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కార్మికుల సమస్యల పరిష్కరించడం, ఐక్యత, పోరాట నినాదాలతో సీఐటీయూ ఏర్పడిందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. గురువారం స్థానిక హమాలి అడ్డాలో సీఐటీయూ 54వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగుర వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు అండగా ఉంటూ, ఐక్య ఉద్యమాలను అభివృద్ధి చేయడంలో సీఐటీయూ అగ్రభాగాన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు కేసుపాక నరసింహారావు, ఏసు, రాంబాబు, రమేష్, నాగేంద్ర, ఖాసీం, కార్మికులు పాల్గొన్నారు.

ములకలపల్లి: సీపీఎం అనుబంధ కార్మిక సంఘం సీఐటీయూ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవాన్ని ములకలపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ మండల కన్వీనర్ నిమ్మల మధు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మిక వర్గ సమస్యలపై అనునిత్యం పోరాడేది ఎర్రజండానే అని అన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుబ్బా ధనలక్ష్మి, గంటా శ్రీనివాసరావు, వర్కా రుక్మాంగధరరావు, చిక్కుల శ్రీను. నాగరాజు, మిరియాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: సీఐటీయూ జెండా ఎగుర వేసి, నినాదాలు చేస్తున్న కార్మికులు



ములకలపల్లి: పతాకావిష్కరణ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు

పేకాట రాయుళ్ల అరెస్ట్

మణుగూరుటౌన్: మండలంలోని బాయికూనవరంలోని మామిడి చెట్ల కింద పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకున్నారు. రాత్రి సమయంలో వారి వద్ద నుంచి రూ. 1200 డబ్బులను ఎస్సై ప్రసాద్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

కరకట్ట పనులు అడ్డగింత

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ శివారులోని కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న గోదావరి కరకట్ట నిర్మాణ పనులను గురువారు స్థానిక రైతులు అడ్డుకున్నారు. నిర్మాణ పనుల వలన తమ పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోయారు. పొలాలకు నష్టపరిహారం చెల్లించి పనులు చేసుకోవాలని ఆందోళన చేశారు. దీంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు సమస్యను ఎమ్మెల్యే వెంకట్రావ్ దృష్ట తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన తాను స్థానికంగా లేనని తెలిపి రెవెన్యూ అధికారులతో మాట్లాడి రైతుల వద్దకు వెళ్ళి పనులు జరిగే విధంగా మాట్లాడాలని ఆదేశించారు. రెండు రోజుల్లో హైదరాబాద్ నుంచి రాగానే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇవ్వడంతో కరకట్ట పనులు యథావిధిగా జరిగాయి.

ద్విచక్ర వాహనాలు ఢీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు కాగా స్థానికులు క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరు భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన బాలు కాగా, ప్రమాదంలో అతని కుడి కాలు ఫ్రాక్చర్ కాగా కుటుంబ సభ్యులు బాలుని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిలో మరో వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుక్కునూరుకి చెందిన వెంకటేశ్వర్లు అని అతని ఒంటిపై పలు చోట్ల ఫ్రాక్చర్లు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతానికి ప్రమాదంలో గాయపడిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.

గ్రామదేవత, నాభిశిలకు జలాభిషేకం



జలాభిషేకాలు అనంతరం పూజలు చేస్తున్న గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామంలో గ్రామదేవతల, నాభిశిల ప్రతిష్టాపన ద్వితీయ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతిష్టాపన మహోత్సవం సందర్భంగా గ్రామంలోని అన్ని వీధుల్లో మామిడాకుల తోరణాలు కట్టి గ్రామదేవతను అలంకరించారు. అనంతరం గ్రామ మహిళలు ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి, నాభిశిలకు జలాభిషేకాలు నిర్వహించారు. మరో మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని గ్రామపెద్దలు, అర్చకులు చెప్పారు.

అస్థిత్వాన్ని దెబ్బతీసేలా పాలన

మణుగూరురూరల్: పదేళ్ల కేసీఆర్ పాలనతో పోటీ పడలేక తెలంగాణ రాష్ట్ర అస్థత్వాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణా అంటేనే చారిత్రాత్మక చార్మినార్ కట్టడం, కాకతీయ శిలాతోరణం అని, ఆ రెండు లేకుండా తెలంగాణాకు కొత్త లోగోను తయారు చేయడం అత్యంత దురదృష్టకమన్నారు. టీఎస్‌ను టీజీగా మార్చినంత మాత్రాన తెలంగాణకు సీఎం రేవంత్‌రెడ్డి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తెలంగాణ సాధన ఆకాంక్షలను దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని మార్పులు చేసినా తెలంగాణ ప్రజల గుండెల్లో మాజీ సీఎం కేసీఆర్‌కు సుస్థిర స్థానం ఉందన్నారు.

చిహ్నాలను తొలగిస్తే ప్రజా ఉద్యమం..

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వ ఆమోదం తెలిపిన తెలంగాణ రాష్ట్రా చిహ్నాలను తొలగిస్తే ప్రజా ఉద్యం చేస్తామని బీఆర్ఎస్ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానె రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా, రైతుల సమస్యలను గాలికొదిలేసి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షల స్వప్నమైన అధికారిక చిహ్నాలను అవమానిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్ళను ధ్వంసం చేసే కుట్ర జరుగుతుందని, ఈ పరిణామాలను తెలంగాణ ప్రజానీకం తీవ్రంగా ఖండించాలని ఆయన కోరారు.

ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే..

దమ్మపేట: మండల కేంద్రంలోని జీసీసీ ఆవరణలో ఉన్న శ్రీమద్రి భక్తాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని ఆలయ అర్చకులు చామర్తి సాయిప్రసాద్ శాస్త్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

దమ్మపేట గ్రామంలోని భక్తాంజనేయస్వామి ఆలయంలో రేపు(శనివారం) హనుమాన్ జయంతిని పురస్కరించుకుని, నాగవల్లి దళ పత్రాలు, కుముద పుష్పాలతో విశేష అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్ర సమయంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జయంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



మణుగూరుటౌన్: విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్



అశ్వారావుపేటరూరల్: గ్రామాల్లో అవగాహన ర్యాలీ..

మణుగూరుటౌన్: వానాకాలం సమీపిస్తున్న వేళ రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించొద్దని నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సీఐ సతీష్‌కుమార్ అన్నారు. గురువారం మణుగూరు పట్టణంతో పాటు మండలంలోని పలు విత్తన దుకాణాలను ఏఓ రామశివరావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డుల ప్రకారం ఉన్న స్టాక్ విలువలను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీఐ సూచించగా, వ్యవసాయ విస్తీర్ణ ఆధారంగా విత్తనాలు అందుబాటులో ఉంచామని ఏఓ తెలిపారు. నకిలీ విత్తనాలతో అన్నదాతల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉన్నందున విత్తన దుకాణాల్లో అలాంటి అక్రమాలకు అవకతవకలకు తావివ్వకుండా నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని యజమానులకు సూచించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అన్నపురెడ్డిపల్లి: నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిణి అనూష, టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజ్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. విత్తనాల డీలర్లు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఖచ్చితంగా సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని పలు విత్తనాల దుకాణాలను గురువారం టాస్క్ ఫోర్స్ అధికారుల బృందం ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ సహాయ సంచాలకురాలు అఫ్జల్ బేగం, సీఐ జితేందర్ రెడ్డి, ఏఓ నవీన్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించి రైతులకు విక్రయించిన వివరాలను తెలుసుకున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

రైతులకు అవగాహన

నకిలీ విత్తనాలపై వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మండలంలోని రామన్నగూడెం, కోయ రంగాపురం, మామిళ్లవారిగూడెం, దురదపాడుతోపాటు పలు గ్రామాల్లో ఏఓ నవీన్, ఏఈఓలు షాకిరా భాను ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించి, రైతులకు నకిలీ విత్తనాల గురించి వివరించారు. అలాగే గ్రామాల్లో నకిలీ, లూజు విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే వారి సమాచారాన్ని అందించాలని కోరారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలని, ఆయా బిల్లులను పంట కాలం ముగిసే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

నేటి నుంచి జీలుగు విత్తనాలు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నేటి నుంచి సబ్సిడీపై రైతులకు జీలుగు విత్తనాలు అందజేయనున్నట్టు సంఘం సీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు విత్తనాలు పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లు తీసుకొనిరావాలన్నారు. రెండున్నర ఎకరాలకు ఒక బ్యాగు ఇస్తామని 30 కేజీల బ్యాగు ధర రూ.1116 అని ఆయన తెలిపారు.